క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ఇంగ్లిషు మీడియంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేఎంయూ రాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థులకు 75 శాతం, బీసీ (సి) 12 శాతం, ఎస్టీ 6 శాతం, బీసీలకు 5 శాతం, ఇతరులకు 2 శాతం సీట్లు కేటాయించారన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉండాలన్నారు. 5వ తరగతి ప్రవేశాలకు మార్చి 10న ఉదయం 10 గంటలకు, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిత్తడినేలలు మానవాళికి ప్రయోజనకరం

గోకవరం: చిత్తడి నేలలు మానవాళికి ఎంతో ప్రయోజనకరమని ఫోక్స్‌పేట రేంజర్ ఎం.కరుణాకర్ అన్నారు. ప్రపంచ చిత్తడినేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సూదికొండలోని ఫోక్స్‌పేట రేంజర్ కార్యాలయంలో సిబ్బందికి చిత్తడి నేల–మానవాళి సంబంధంపై అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తడినేలలు జీవవైవిధ్య సూచికలన్నారు. మానవాళికి పరోక్షంగా నీటి భద్రత, ఆరోగ్య భద్రత కల్పిస్తాయన్నారు. చిత్తడినేలలను సంరక్షించడానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సుజాత, సెక్షన్ ఆఫీసర్ నూకరాజుదొర, అప్పారావు, వరలక్ష్మి, బీటుగార్డులు అరుణ, ప్రశాంత్‌కుమార్, పద్మ, శ్రీను, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములు పేదలకు పంచాలంటూ ధర్నా

రౌతులపూడి: మండలంలోని కోడూరు, పారుపాక, ఎస్.అగ్రహారం, పి.చామవరం గ్రామాల్లో పోడు భూములను నిరుపేదలకు పంచాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ శ్రేణులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యలయం ఎదుట ధర్నా చేశారు. స్థానిక మార్కెట్ సెంటర్ నుంచి తాహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. లిబరేషన్ పార్టీ నాయకులు కామిరెడ్డి నారాయణమూర్తి, మానుకొండ లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఆనందరావు మృతి


ఆనందరావు (ఫైల్)

రౌతులపూడి: శంఖవరం, రౌతులపూడి మండలాల మాజీ కో ఆప్షన్ సభ్యుడు కంచర్ల ఆనందరావు (90) గురువారం రాత్రి మృతి చెందారు. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన రౌతులపూడిలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

4న పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు

కిర్లంపూడి/ప్రత్తిపాడు: పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్ మండలాధ్యక్షుడు వై.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యాయుడు బాలిన నూకరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షల శిక్షణా నిపుణులు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ నెల 4న కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు గ్రూప్స్, డీఎస్సీ, టెట్ పోటీ పరీక్షలపై ఉచితంగా అవగాహన సదస్సు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులకు ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హాజరుకావాలని కోరారు.

మహిళలకు గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో మహిళలకు శుక్రవారం ప్రధానమంత్రి ఉజ్వల పథకంలో గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు ఉండి గ్యాస్ కనెక్షన్ రానివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్యాస్ తీసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం రూ.300 సబ్సిడీ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కొల్లా శ్రీనివాస్, వెలుగూరి హరేరామ్, కురాకుల రాజా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

కిర్లంపూడి: మండలంలోని ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరినట్లు ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గం కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ తెలిపారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు వేసి ఆహ్వానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలకు జనం ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు, బాలిన వెంకటేశ్వరరావు, పల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించేందుకు మేము సిద్ధం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- జగ్గంపేటలో సిద్ధం పోస్టర్లతో నినాదాలు



జగ్గంపేటలో సిద్ధం పోస్టర్లతో నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు మేము సిద్ధం, మా ఊరు సిద్ధం అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఏలూరులో శనివారం నిర్వహించే సిద్ధం బహిరంగ సభ విజయవంతంపై జగ్గంపేటలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఆయన సమీక్షించారు. స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద సిద్ధం పోస్టర్లతో నినాదాలు చేశారు. జగ్గంపేట నుంచి సుమారు 5 వేల మంది ఏలూరు సిద్ధం సభకు బస్సులు, కార్లలో తరలి వెళుతున్నట్టు తోట నరసింహం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, తోట రాంజీ, వైఎస్సార్ సీపీ నేతలు అత్తులూరి సాయిబాబు, పెద్దాడ రాజబాబు, గఫూర్, నకిరెడ్డి నాగేశ్వరరావు, కాపారపు రమణ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేయండి

తుని రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏలూరులో శనివారం నిర్వహించే సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆత్మ కమిటీ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు పిలుపునిచ్చారు. మండలంలోని తేటగుంటలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా నాయకత్వంలో సిద్ధం సభకు నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. అన్ని గ్రామాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ బస్సులు శనివారం తొండంగి మండలం నిఖిల్ దాబా వద్ద నుంచి బయలు దేరుతాయన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పేరూరి బద్రి నారాయణ, సర్పంచ్ అత్తి నాగరాజు, ఉపసర్పంచ్ పోతుల పెదకాపు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుండుబిల్లి వెంకటరమణ, నాయకులు రాజబాబు రాజు, బుజ్జిబాబు రాజు, గణేసుల వీరబాబు పాల్గొన్నారు.


తేటగుంటలో వైఎస్సార్ సీపీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్న ఆత్మ చైర్మన్ రాంబాబురాజు

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరావు

తుని: ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటరావు ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై శుక్రవారం సచివాలయ, వైద్య సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డును నేరుగా లబ్ధిదారులకు అందజేసి, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు.

నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి


తునిలో నాయీబ్రాహ్మణుల సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా

తుని: నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయీబ్రాహ్మణుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం మంత్రి దాడిశెట్టి రాజా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల సంక్షేమ కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేయడంతో పాటు కులవృత్తిని అభివృద్ధి చేసుకునేందుకు ఆర్థిక సహాయాన్ని అందిస్తోందన్నారు. అన్నివర్గాలకు మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. అన్నవరం దేవస్థానం బోర్డు మెంబర్ దోమడ సుందరరావు, నాయీబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా శివప్రసాద్



ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా కె.శివప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నంలో జోనల్ కమిషనర్‌గా పని చేస్తున్న శివప్రసాద్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన కొండలరావు బదిలీపై యలమంచిలి వెళ్లగా మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు కమిషనర్‌గా ఇప్పటివరకు అదనపు బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తహసీల్దార్‌గా ఆశయ్య బాధ్యతల స్వీకరణ



కిర్లంపూడి: స్థానిక తహసీల్దార్‌గా బి.ఆశయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఎన్టీఆర్ జిల్లా వేరుల్లపల్లి మండలంలో పని చేస్తున్న ఆశయ్య ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన కేవీ మాధవరావు కృష్ణజిల్లా పెదపాడుపూడి మండలానికి బదిలీ అయ్యారు. స్థానిక నాయకులు, అధికారులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది బదిలీ అయిన తహసీల్దార్ మాధవరావును పూలమాల, శాలువాతో సత్కరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆశయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

సురక్షతో ప్రజల చెంతకే వైద్య సేవలు


ప్రత్తిపాడులో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న సర్పంచ్ గుడాల విజయలక్ష్మి


జె.అన్నవరంలో వైద్య పరీక్షలకు వచ్చిన ప్రజలు

ప్రత్తిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రభుత్వం ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యాన్ని తీసుకువచ్చిందని గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి అన్నారు. ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసిందన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. వైద్య నిపుణులు విజయ ప్రసాద్, హిమబిందు, రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్ఆర్ పవన్‌కుమార్ తదితరులు 326 మందికి వైద్య పరీక్షలు చేశారు. రోగులకు మందుల కిట్లను సర్పంచ్ విజయలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ద్విబాష్యం శ్రీనివాసరావు, లయన్స్‌క్లబ్ ప్రతినిధి జి.వెంకటరత్నం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జె.అన్నవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ కొండపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీలక్ష్మి రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాలారి సత్యనారాయణ, బి.కన్నారావు, కాలారి శ్రీను, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం వెళ్లి పింఛను అందజేత


రాజమహేంద్రవరంలో సన్నిబాబుకు పింఛను ఇస్తున్న వలంటీర్ పృథ్విరాజ్

తుని: స్థానిక కొండవారిపేటకు చెందిన బేతా సన్నిబాబు అనారోగ్యంతో రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను పింఛను లబ్ధిదారు కావడంతో వార్డు వలంటీర్ పృథ్విరాజ్ తన సొంత ఖర్చులతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి వెళ్లి సన్నిబాబుకు పింఛను అందజేశాడు. సేవా భావం చాటిన వలంటీరు పృథ్విరాజ్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి, కౌన్సిలర్లు అభినందించారు.

జోరుగా పింఛన్ల పంపిణీ

ఏలేశ్వరం: పట్టణంలో గురువారం రెండోరోజు సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. పట్టణంలో సుమారు 3878 పింఛన్లు ఉండగా 98 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల హైమావతి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు. మండలంలోని తూర్పు లక్ష్మీపురంలో మాజీ సర్పంచ్ యిజనగిరి సత్యవతి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.


ఏలేశ్వరంలో పింఛన్ అందజేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ హైమావతి

తహసీల్దార్ శ్రీదేవికి పదోన్నతి


పదోన్నతి పొందిన తహసీల్దార్ శ్రీదేవిని సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

జగ్గంపేట: స్థానిక తహసీల్దార్ బి.శ్రీదేవి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై కృష్ణ జిల్లాకు బదిలీ అయ్యారు. కృష్ణా జిల్లా కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయిన ఆమె గురువారం రాత్రి జగ్గంపేటలో రిలీవ్ అయ్యారు. పదోన్నతిపై వెళుతున్న బి.శ్రీదేవిని జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పూలమాల, శాలువాతో సత్కరించారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

తొండంగి: మండలంలోని గ్యాస్ వినియోగదారులంతా ఈ-కేవైసీ చేయించుకోవాలని స్థానిక వైష్ణోదేవీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు వడ్డాది భాస్కరసత్యప్రసాద్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఇప్పటికే గ్యాస్ ఏజెన్సీలో ఈ-కేవైసీ ప్రారంభించామన్నారు. వినియోగదారుల సౌలభ్యం కోసం ప్రత్యేక బృందం సభ్యులు గ్రామాల్లో క్యాంపైనింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు.

మండల సమావేశం బహిష్కరణ


రౌతులపూడిలో మెజార్టీ సభ్యులు లేకున్నా అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి

- ఎంపీపీ తీరుకు నిరసనగా ప్రజాప్రతినిధుల నిర్ణయం
- అయినప్పటికీ అధికారులతో సమీక్షించిన ఎంపీపీ


సమావేశాన్ని బహిష్కరించి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీలు, సర్పంచులు

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వైఎస్సార్ సీపీకి చెందిన మెజార్టీ ప్రజాప్రతినిధులు బహిష్కరించారు. అయినప్పటికీ సమావేశపు హాలులోని కొంతమంది ఒత్తిడితో సభను నిర్వహించడానికి ఎంపీపీ పూనుకున్నారు. ఈ మేరకు కొంతమంది అధికారులను పిలిచి సంబంధిత శాఖల పనితీరుపై సమీక్షించారు. దీనిపై ఆగ్రహించిన ఎంపీటీసీలు, సర్పంచులు తమ ఆమోదంతో ఎంపీపీగా ఎంపికైన మీరు మమ్మల్ని అగౌరవ పరుస్తూ సభను ఎలా నిర్వహిస్తారంటూ ప్రశ్నించారు. సభ్యుల ఆమోదం లేకుండా రివ్యూ పేరుతో సభను నిర్వహించడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. దీంతో చేసేదేమీ లేక ఎంపీపీ సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం ఎంపీటీసీలు, సర్పంచులు మండల పరిషత్ కార్యాలయం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీలో ఎంపీటీసీగా గెలిచిన గంటిమళ్ల రాజ్యలక్ష్మిని తామంతా ఎంపీపీగా ఎన్నుకున్నామన్నారు. ఆమె ఇటీవల కొంతకాలంగా పార్టీకి, పదివికి రాజీనామా చేయకుండా టీడీపీలోకి చేరి తమను తీవ్రంగా అగౌరవ పరుస్తోందని ఆరోపించారు. తమ ఆమోదం లేకుండా సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం ఎంతవరకూ న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎంపీపీ తన తీరును మార్చుకుని సభ్యులందరికీ గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ వైఖరికి నిరసనగా తామంతా సమావేశాన్ని బహిష్కరించినట్టు తెలిపారు.

అపీత కుచాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అపీత కుచాంబ అమ్మవారు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో అపీత కుచాంబ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు అమ్మవారికి పూజలు, అభిషేకాలు చేసి పూలతో విశేష అలంకరణ చేశారు. అనంతరం ఆలయంలో లలితా సహస్ర నామ పారాయణ, విష్ణుసహస్రనామ పారాయణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కాలభైరవస్వామికి విశేష పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో కాలభైరవస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గోకవరం ఎంపీడీఓగా వసంత


గోకవరం ఎంపీడీఓ వసంతకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

గోకవరం: స్థానిక ఎంపీడీఓగా కె.వసంత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించిన కె.పద్మజ్యోతి పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వసంత ఇక్కడకు బదిలీపై వచ్చారు. నూతన ఎంపీడీఓ వసంతకు ఏఓ ప్రసాద్, ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, కార్యదర్శులు టంకాల శ్రీనివాస్‌రావు, రమణకుమారి తదితరులు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలి


ఆత్మీయ కలయికలో పాల్గొన్న తోట బాబ్జీ

కిర్లంపూడి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ పిలుపునిచ్చారు. మండలంలోని శృంగరాయునిపాలెంలో గూడుపు ఆదినారాయణ అధ్యక్షతన వైఎస్సార్ సీపీ నాయకులతో శుక్రవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఓలేటి రాజు, గరగా పెద్దకాపు, నక్కిరెడ్డి సుధాకర్, బుర్రశాంతి మోహన్, గొల్లపల్లి సత్యనారాయణ, జి.అప్పన్న, బేరి బాబ్జీ, జలసూత్రపు వెంకన్న, నడిపల్లి గోవిందు, తుమ్మల వీరబాబు, అరబోలు వాసు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పాతకొట్టాంలో దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ సూచించారు. మండలంలోని కేఏ మల్లవరం, పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన డ్రై డే–ఫ్రై డే కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. క్రమం తప్పకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు కుశిరెడ్డి అప్పలరాజు, రాజానాగేశ్వరరావు, జయలక్ష్మి పాల్గొన్నారు.

జి.కొత్తపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు


జి.కొత్తపల్లిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సౌమ్యశ్రీ

శంఖవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు వైద్యం చేరువైందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి సౌమ్యశ్రీ రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. కౌమార దశలో ఉన్న యువతుల్లో రక్తహీనత ఉంటే ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. 50 మంది సాధారణ రోగులు, 20 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 40 మంది మధుమేహ బాధితులు, 30 మంది రక్తపోటుతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందిచామని వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ


ఏలూరులో ఎలుకల నివారణ మందు తయారు చేస్తున్న వ్యవసాయ సహాయకులు

ప్రత్తిపాడు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద శుక్రవారం రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పించారు. విషపు ఎరను తయారు చేసే విధానాన్ని వ్యవసాయ సిబ్బంది రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. 100 గ్రాముల మందు, 100 గ్రాముల నూనే, 10 కేజీల నూకలను కలిపిన మందును ఐదు నుంచి పది గ్రాముల పొట్లాలుగా కట్టి ఎలుకల బొరియల్లో పెడితే అవి తిని ఎలుకలు చనిపోతాయని మండల వ్యవసాయాధికారి యింటి వీర గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఏపీఎంఐపీ పీడీ ప్రసాద్, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సామూహిక నివారణతో సత్ఫలితాలు

గండేపల్లి: సామూహిక ఎలుకల నివారణతో రైతులు సత్ఫలితాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి అన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ శుక్రవారం రైతులకు ఎలుకల మందు పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎలుకల కారణంగా వరిలో 15 శాతం దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఎలుకలను నివారించేందుకు గ్రామాల్లో రైతులందరూ ఒకేరోజు సామూహిక ఎలుకల నివారణ చేట్టాలని సూచించారు. విషపు ఎర తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం జెడ్.రాగంపేటలో వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ఎలుక బొరియల్లో మందు పెట్టే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


ముక్కొల్లులో రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సామూహిక ఎలుకల నివారణపై అవగాహన

కిర్లంపూడి: మండలంలోని ముక్కొల్లు ఆర్‌బీకేలో రైతులకు శుక్రవారం సామూహిక ఎలుకల నివారణపై ఏఓ జోకా అమృత రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ అమృత మాట్లాడుతూ ఎలుకల నివారణకు రైతులంతా ఒకేసారి పొలాల్లో ఎలుకల మందు పెట్టాలని సూచించారు. విషపు ఎర తయారీపై రైతులకు అవగాహన కల్పించారు.

సమస్యాత్మక గ్రామాల్లో పటిష్టమైన భద్రత


మల్లేపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ లక్ష్మణరావు

గండేపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయనున్నట్టు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గండేపల్లి ఎస్సై ఎన్.రామకృష్ణతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రాలు, గ్రామాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. రౌడీషీటర్ల బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.